క్లుప్తంగా

ఘనంగా సత్యసాయి పల్లకీ సేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

రాజాం: భగవాన్ సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కొండం పేట లో సోమవారం పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భక్తులు గ్రామంలో పలు వీధుల్లో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించి, భజనలు చేశారు. బాలవికాస్ కేంద్రం చిన్నారులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఫ్రెండ్స్ సేవలు అభినందనీయం



మైత్రి వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం సిటీ: ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు రూ.4లక్షలతో నిర్మించిన మైత్రి కళా వేదికను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బి.వి. అచ్యుత్‌కుమార్, గట్టి పాపారావు, ఇద్దం శ్రీనివాసరావు, వావిలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ




మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

రాజాం సిటీ: పర్యావరణ హితం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని పట్టణానికి చెందిన పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు కోరారు. స్థానిక కేర్ రోడ్డులోని రాజాం మార్ట్ వద్ద మార్ట్ యజమాని కడగల నాగరాజు సమకూర్చిన 600 మట్టి వినాయక ప్రతిమలను సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు కె.నాగరాజు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, టి.టి.వి. రమణమూర్తి, వైద్యాధికారి సామంతుల శరత్‌కుమార్, వాకచర్ల పైడిరాజు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 34మంది ఎంపిక

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామ సమీపంలోని గోకుల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్‌లో సోమవారం దివీస్ ల్యాబరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలలకు చెందిన బీఫార్మసీ, ఎం ఫార్మసీ,.మెకానికల్ తదితర విభాగాలకు చెందిన 64 మంది విద్యార్థులు హాజరు కాగా 34 మంది ఎంపికయ్యారని గోకుల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ బొట్టా వెంకటరమణ యాదవ్ తెలిపారు.ఎంపికైన వారికి నెలకు రూ. 25 వేల వేతనంతోపాటు పీఎఫ్,ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలను కంపెనీ కల్పిస్తుందని చెప్పారు.


మడ్డువలస నుంచి 2,500 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



ఒక గేటు ద్వారా నీటిని దిగువకు విడిచిపెడుతున్న దృశ్యం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నుంచి సోమవారం 2,000 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి, 500 క్యూసెక్కుల నీటిని కుడి ప్రధాన కాలువకు విడిచిపెట్టినట్టు ఏఈ నితిన్ తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 2వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోందన్నారు. ప్రాజెక్టు వద్ద 64.52 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు వెల్లడించారు.

ఉప్పొంగిన బందిగెడ్డ



వన్నలి వద్ద పంటపొలాల మీదుగా ప్రవహిస్తున్న నీరు

రేగిడి: మండలంలోని బందిగెడ్డ సోమవారం ఉప్పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి. అంబకండి వద్ద ప్రారంభమైన ఈ గెడ్డ ఉప్పొంగడంతో వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, అక్కన్నఅగ్రహారం గ్రామాల పరిధిలోని సుమారు 2వేల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఏటా గెడ్డ ఉప్పొంగడం వల్ల పంట పొలాలు నీట మునుగుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు
- గిరాకీ లేక స్టాండ్‌లకే పరిమితమవుతున్న ఆటోలు
- పూటగడవడమే కష్టంగా మారిందని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న ఆటో డ్రైవర్లు



రామభద్రపురం బాడంగి రూట్ ఆటోస్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

ఆటోవాలా దివాలా..!



తమను ఆదుకోవాలని, తమకిచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ఆటో డ్రైవర్లు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ఆటోవాలాల బతుకులపై గట్టి దెబ్బ కొట్టింది. ఎన్నో ఏళ్లుగా ఆటోలను నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వేలాది మంది కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సామాన్య ప్రజానీకం ఎక్కువగా ఆటోల్లోనే ప్రయాణాలు సాగిస్తుంటారు. వారిలో మహిళలు, విద్యార్థినులే ఎక్కువగా ఉంటారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులోకి రావడంతో మహిళలు, విద్యార్థినులు బస్సుల్లోనే రాకపోకలు సాగించడానికి ప్రాధాన్యం ఇస్తుండడంతో ఆటోలకు గిరాకీ లేకుండా పోతోంది. ఆటో డ్రైవర్లు రోజంతా తమ ఆటోలను స్టాండ్‌ల్లో నిలుపుకొని గిరాకీలు లేకపోవడంతో సాయంత్రం ఉత్త చేతులతో ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని రామభద్రపురం,బొబ్బిలి టౌన్,బొబ్బిలి రూరల్, బాడంగి,తెర్లాం మండలాల్లో సుమారు 1,500 నుంచి 1,600 వరకు ఆటోలు ఉన్నాయి. వీరంతా ప్రస్తుతం ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించింది.

తగ్గిన ఆదాయం..తప్పని ఖర్చులు

పెరుగుతున్న డీజిల్,పెట్రోలు ధరలు ఇప్పటికే ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండికొడుతున్నాయి. వీటికి తోడు ప్రతీ ఏడాది ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం దాదాపు రూ.13 వేలు దాకా ఖర్చు అవుతోంది. ఇవి చాలవన్నట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తనిఖీల పేరుతో పోలీసులు,రవాణా శాఖ అధికారుల వేధింపులు పెరిగిపోయాయని, వేల రూపాయలు జరిమానా విధిస్తున్నారని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. గతంలో ఆయిల్ ఖర్చులు పోనూ రోజుకు ప్రాంతాన్నిబట్టి సుమారుగా ఒక్కో డ్రైవర్ రోజుకు రూ.600 నుంచి రూ.1,000 వరకు సంపాదించే వారు. దీంతో కుటుంబ పోషణ, పిల్లల స్కూల్, కాలేజ్ ఫీజులు చెల్లింపులు, ఇతర అవసరాలకు అంతగా ఇబ్బంది పడాల్సి ఉండేది కాదు. ప్రస్తుతం ఆటోలు ఎక్కే మహిళా ప్రయాణికులు, విద్యార్థినులు తగ్గిపోవడంతో రోజుకు రూ.200 నుంచి రూ.300 కూడా రావడం లేదని ఆటోడ్రైవర్లు అంటున్నారు. వచ్చిన డబ్బులు రోజు వారీ ఇంటి ఖర్చులకే చాలడం లేదని, ఇక పిల్లల ఫీజులు, మిగతా ఖర్చులకు ఏం చేయాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఫైనాన్స్‌పై, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి ఆటోలను కొనుగోలు చేశారు. వీరంతా వచ్చే నెల నుంచి ఈఎంఐలు, రుణాలకు నెలవారీ వడ్డీలు ఎలా కట్టాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

జగన్ ప్రభుత్వంలో భరోసా

2019కు ముందు ప్రతిపక్ష నేతగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయన్ని ఆటో డ్రైవర్లు కలిసి తమసమస్యలను చెప్పుకున్నారు. తాము అధికారంలోకి వస్తే సొంతంగా ఆటో ఉన్నవారితో పాటు ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు ఇస్తామని ఆయన మాట ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వాహన మిత్ర పథకం పేరిట రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. అయిదేళ్ల పాటు ఏటా సాయం అందిస్తూ వచ్చారు.ఈ డబ్బులను ఆటో మరమ్మతులు, ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి వాటి కోసం ఉపయోగించుకునేవారు. అలాగే డ్రైవర్లు ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా వర్తింపజేసి ఆదుకున్నారు.

కానరాని సంక్షేమ బోర్డు.. అందని ఆర్థిక సహాయం

ఆటో డ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్యబీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు, తక్కువ వడ్డీకి రుణాలు, తదితర హామీలను కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిపోయినా వీటిలో ఏ హామీ కార్యరూపం దాల్చలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం ఇవ్వాల్సిందేనని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సాయం అందించక పోగా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రకరకాల పేర్లతో అపరాధ రుసుములు విధిస్తూ బాదుడు మొదలు పెట్టిందని, తమను అన్ని విధాలా ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆటో కార్మికులు మండిపడుతున్నారు.

మా పొట్ట కొట్టారు..



నేను దాదాపు 20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను.ఇదే మా జీవనాధారం.దీని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.ఆటోలో ప్రయాణించేవారిలో 80 శాతం మహిళలే. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటో ఎక్కడం లేదు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టి మా పొట్టకొట్టింది. మేము ఉపాధి కోల్పోయాం, కుటుంబ పోషణ కష్టంగా మారింది.

– పాలవలస బారిక, బాడంగి రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

హామీలు అమలు చేయాలి



ఆటో కార్మికులకు ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామని, ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు.అధికారంలోకి రాగానే హామీలు పరిచిపోయారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఆ హామీలకు అతీగతీ లేదు.గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదుకున్న రీతిలోనే ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కె శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, రామభద్రపురం

నిలువునా ముంచారు..



ఎన్నికల ముందు ఆటో కార్మికులకు చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు.మేనిఫెస్టోలో సైతం పెట్టారు.అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదు. పైగా ఆటో కార్మికులు నష్టపోయేలా ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి అన్యాయం చేశారు. నమ్మి ఓట్లు వేసినందుకు నిలువునా ముంచుతున్నారు.

– ఎస్.గంగరాజు, సాలూరు రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

ఆదుకోవాలి..



బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసుకుని నెలనెలా ఈఎంఐలు చెల్లించి మిగిలిన అరకొర సొమ్ముతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. కొందరు ఆటోలు అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం మాలాంటి వారి ఉపాధికి గండికొట్టింది. ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది. ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకునే నిర్ణయాలు తీసుకోవాలి.

– సీహెచ్ లోకేష్, బొబ్బిలి రూట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు

• 28న ఆటోల బంద్



సమావేశానికి హాజరైన ఆటో డ్రైవర్లు

రాజాం సిటీ: ఈ నెల 28న నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టనున్న ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని మండల ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కోటి, నారాయణరావు పిలుపునిచ్చారు. పట్టణంలో మండల ఆటో డ్రైవర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా కోటి, నారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం తో గిరాకీ లేక ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆదాయం లేక కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని వాపోయారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఆటోల బంద్‌లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈనెల 28న చేపట్టనున్న ధర్నాలో ఆటో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తి నాయుడు, సత్యనారాయణ, రాము, గణేష్, మౌళి, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

• యూరియా కోసం రైతుల పాట్లు



ఈ ఫొటోలో జోరువానలోనూ గొడుగులు వేసుకుని నిరీక్షిస్తున్నది మెంటాడ మండలం జయితిగ్రామ రైతులు. యూరియా కోసం గ్రామ సచివాలయం వద్ద సోమవారం గంటల తరబడి నిరీక్షించారు. గ్రామంలో 800 మంది రైతులు ఉండగా, కేవలం 260 బస్తాల యూరియా వచ్చింది. రైతుకు ఒక బస్తా కూడా అందలేదు. వర్షంలో క్యూ కట్టినా నిరాశే ఎదురైంది. – మెంటాడ

ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



ఎంపీడీఓ రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

తెర్లాం: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని మండలంలోని పలుగ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో తాము గ్రామాల్లో ఎలాంటి పనులూ చేయలేకపోతున్నామని అన్నారు. 14 నెలలుగా నిధులు విడుదల చేయలేదని, రెండు విడతల బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. నిధులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించలేకపోతున్నామని, వీధి దీపాలు కూడా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీడీఓ రేగి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.

కలెక్షన్ సెంటర్ ప్రారంభం



కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ భానుమూర్తి

మెంటాడ: గిరిజనుల పంట ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు మండలంలోని లోతుగెడ్డ పంచాయతీలోని ఎర్రవానివలసలో నాబార్డ్ సహకారంతో బ్రిడ్స్ సంస్థ నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను ఎంపీడీఓ భానుమూర్తి సోమవారం ప్రారంభించారు. అలాగే స్కూల్, కళాశాలలకు వెళుతున్న 16మంది విద్యార్థినులకు సైకిళ్లు, పంటల విక్రయాల్లోదళారుల చేతిలో తూనికల్లో మోసపోకుండా గిరిజన రైతులకు ఏడు తూనిక యంత్రాలు,180మంది గిరిజన విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్, ఏడుగురు ఆరోగ్య కార్యకర్తలకు మెడికల్ కిట్లు అందజేశారు. బ్రిడ్స్ సంస్థ సీఈఓ రామకృష్ణరాజు మాట్లాడుతూ ఎఫ్‌ఎఫ్‌పీడీ ప్రోగ్రాంలో భాగంగా ఈకార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. త్వరలో నాబార్డ్ సహకారంతో 300 మంది రైతులతో 300 ఎకరాల్లో వివిధ రకాల మొక్కల పెంపకం చేపడతామని తెలి పారు. కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాతలు ఎర్ర సూరమ్మ, రామును సన్మానించారు. సర్పంచ్ భీమరావు, వైస్ సర్పంచ్ పైడపునాయుడు, పంచాయతీ కార్యదర్శి బిల్లా పద్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ క్రాంతి, సుమన్,ఆదిత్య బ్రిడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కాముకురాలు ప్రకాశమణీజీ



ప్రకాశమణీజీకి నివాళులర్పిస్తున్న శంబంగి

బొబ్బిలి: రాజ యోగిని దీదీ ప్రకాశమణీజీ ప్రపంచ శాంతి కాముకురాలు అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు.సోమవారం దీదీ ప్రకాశమణీజీ వర్ధంతి నేపథ్యంలో స్థానిక బ్రహ్మకుమారీస్ యోగ జ్ఞానాశ్రమంలో ఆమె చిత్రపటానికి శంబంగి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రాజేశ్వరి అక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీజే పెడితే సీజే..



సచివాలయ మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

రామభద్రపురం: వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతులు లేవని,డీజే పెడితే సీజ్ చేస్తామని ఎస్‌ఐ వి.ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని గ్రామ సచివాలయ మహిళా పోలీసులతోస్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సమావేశమయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీలకు నిబంధనలపై అవగాహన కల్పించాలని చెప్పారు.డీజేల వల్ల చిన్న పిల్లలు,వృద్ధులకు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని, అందుకే వాటికి అనుమతి నిరాకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా డీజేలు పెడితే సీజ్‌చేసి, కేసు నమోదుకు తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇండియా బుక్‌ఆఫ్ రికార్డుకు ఆద్య ఎంపిక



తండ్రి సురేష్‌కుమార్‌తో ఇండియా బుక్ రికార్డర్ సత్యశ్రీసాయి ఆద్య

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలం అప్పల అగ్రహారం గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల చిన్నారి బొడ్డేపల్లి సత్యశ్రీసాయి ఆద్య ఇండియా బుక్ నిర్వహించిన మెమోరీ పోటీల్లో సత్తాచూపింది. 16 వస్తువులను 47 సెకెన్ల వ్యవధిలో యథాస్థానంలో కూర్పు చేసి ఇండి యా బుక్ జ్ఞాపక శక్తి పోటీల్లో రికార్డు నెలకొల్పింది. చిన్నవయస్సులో ఈ రికార్డు సాధించిన ఘనత ఆద్యకు దక్కింది. జూలైలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచినట్టు ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో సమాచారం అందజేసినట్టు ఆద్య తండ్రి సురేష్‌కుమార్ వెల్లడించారు. ఈయన బ్యాంక్‌ఆఫ్ ఇండియా ఆమదాలవలస బ్రాంచిమేనేజర్‌గా పనిచేస్తున్నారు. జ్ఞాపకశక్తి పోటీల్లో పాల్గొని పలు బహుమతులు పొందారు. ఇప్పుడు కుమార్తెకు శిక్షణ ఇస్తూ పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ఆంజనేయ ట్రేడర్స్ ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అధికారులు బిల్లుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు రూ.16 లక్షల విలువైన ఎరువులు సీజ్‌చేసినట్లు ఏడీఏ కె.చంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి తమకు ఫిర్యాదులు అందడంతోనే దాడులు చేపట్టామని చెప్పారు.సంబంధిత డీలర్‌పై కేసు నమోదుచేశామని తెలిపారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, బిల్లులు లేకుండా విక్రయించినా సంబంధిత దుకాణాల నిర్వాహకులపై చర్యలు తప్పవని అన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ బి.సింహాచలం, ఏఓ సీహెచ్.రఘునాథ్, ఎస్‌ఐ వై.రవికిరణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

మెంటాడ: మండలంలోని ఆంధ్ర- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలంలోని గరుగుబిల్లికి వెళ్లే తారు రోడ్డు పూర్తిగా పాడైందని, తక్షణమే రోడ్డు పునరుద్ధరణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ గిరిజన నాయకుడు అంజలి పైడితల్లి, పలువురు గిరిజనులు డిమాండ్ చేశారు. లోతుగెడ్డ పంచాయతీ పరిధి పాసలపాడులో గిరిజనులు సోమవారం నిరసన తెలిపారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ రోజూ ఈ మార్గంలో వందలాది వాహనాలు తిరుగుతుంటాయని, రోడ్డు ఎక్కడికక్కడ గుంత లు తేలడంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తోందని, అంబులెన్సులు వచ్చేందుకు కూడా ఇబ్బందిగా ఉందని అన్నారు. గతంలో ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరగా.. డిపో మేనేజర్ పరిశీలనకు వచ్చి రోడ్డు సరిగా లేనందున బస్సు నడపలేమని చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, ప్రస్తుత గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి తమ గ్రామానికి ప్రచారానికి వచ్చినప్పుడు కూటమి గెలిచిన వెంటనే కొత్త రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా...

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌టీఓ పద్మనాభం, తదితరులు

బొబ్బిలి: ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్‌టీఓ) పి.వి.పద్మనాభం అన్నారు. బ్రహ్మకుమారీస్ కార్యాల యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువతతో కలిసి ఎస్‌టీఓ పద్మనాభం రక్తదానం చేశారు.

మట్టివినాయక విగ్రహాల పంపిణీ

పట్టణంలోని ఎస్‌టీఓ కార్యాలయం వద్ద స్పార్క్‌సొసైటీ, విజయనగరం ఆధ్వర్యంలో ప్రజలకు సోమవారం మట్టివిగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన, నిర్వాహకులు పి.వి.పద్మనాభం, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రౌతు రామమూర్తినాయుడు, ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ నమోదు ప్రక్రియ పరిశీలన

రాజాం సిటీ: ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు అన్నారు. మండలంలోని అంతకాపల్లి సచివాలయంలో ఈ-శ్రమ్ కార్డుల నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న కార్మికులు ఈ-శ్రమ్ కార్డుకు అర్హులని చెప్పారు. ఈ- శ్రమ్ కార్డులు ఉన్న కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రూ. 2లక్షలు, ప్రమాదం వల్ల పాక్షికంగా అంగవైకల్యం ఏర్పడితే రూ.1లక్ష పరిహారం అందుతుందని చెప్పారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయాలి

వంగర: మండలంలోని వి.వి.ఆర్.పేటను పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేయాలని ఆ గ్రామ ప్రజలు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లను కోరారు. విజయనగరం, పార్వతీపురంలోని కలెక్టరేట్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో కలెక్టర్లు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఏ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేశారు.వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు, టీడీపీ నేత పైడిపునాయుడు, పాల్గొన్నారు.

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

తెర్లాం: మరణానంతరం నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా దానం చేయడం వల్ల కంటి చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అధికారి, రొటేరియన్ ఎస్.వసంత రావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పెరుమాళి మోడల్ స్కూల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ విజయనగరం సౌజన్యంతో నేత్రదానంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

బాడంగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన కూరగాయలు, ఆకు కూరలు, ఇతర పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. ముగడ యూనిట్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కూరగాయలు,ఆకుకూరల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈస్టాల్‌లో కూరగాయలను ఎంపీడీఓతో పాటు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, ప్రజలు కొనుగోలు చేశారు. ఏఓ శ్రీలత, ఏపీఓ సాయిరాం, ప్రకృతి వ్యవసాయ ఎల్ –1 ఈశ్వరరావు,ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.